సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 14 । ఫిబ్రవరి । 2024

ఆడుదాం ఆంధ్రా థీమ్ సాంగ్‌కు నృత్యం చేస్తున్న క్రీడాకారులు





వేడుక అదుర్స్

ఉల్లాసంగా.. ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా'

డాక్టర్ వైఎస్సార్ క్రికెట్ స్టేడియంలో ముగిసిన క్రీడా సంబరాలు

క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించిన ముఖ్యమంత్రి జగన్

విజేతలకు బహుమతుల ప్రదానం

బాణసంచా, లేజర్ షో వెలుగుల మధ్య వైఎస్సార్ స్టేడియం అభివాదం చేస్తున్న సీఎం జగన్



క్రీడాకారులతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

సాగతీరం ఉరకలెత్తింది. క్రీడాలోకం మురిసిపోయింది. ఆడుదాం ఆంధ్రా పేరుతో క్రీడలు నిర్వహించడమే కాకుండా ముగింపు వేడుకలకు స్వయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హాజరుకావడంతో క్రీడాకారుల ఆనందానికి అవధులు లేవు. క్రీడాకారులకు స్ఫూర్తినింపుతూ ప్రసంగించారు. క్రీడా ఆణిముత్యాలకు మన ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అధికారులు తొలుత క్రికెట్ ఫైనల్ విజేత జట్టు కెప్టెన్, వైస్ కెప్టెన్లను మాత్రమే వేదిక పైకి రావాలని ఆహ్వానించారు. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. క్రికెట్ టీమ్ మొత్తం వేదికపైకి రావాలంటూ స్వయంగా ఆయనే చేతులు ఊపి పైకి రావాలని చెప్పడంతో.. క్రికెట్ టీమ్ సభ్యులంతా ఉత్సాహంతో స్టేడియంలో పరుగులు పెట్టారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా బహుమతులు అందుకోవడం జీవితాంతం గుర్తుంచుకుంటామని క్రీడాకారులు ఆనందం వ్యక్తం చేశారు.

సాక్షి, విశాఖపట్నం/విశాఖ స్పోర్ట్స్ : ఉల్లాసంగా.. ఉత్సాహంగా..'ఆడుదాం ఆంధ్రా' క్రీడా సంబరాలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన క్రీడా పోటీలు మంగళవారం విశాఖ వైఎస్సార్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో అంగరంగ వైభవంగా ముగిశాయి. మట్టిలో మాణిక్యాలను ఒడిసిపట్టే మహాయజ్ఞం విశాఖ సాగర తీరంలో ఉవ్వెత్తున ఎగిసిపడింది. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి క్రీడాకారులు విశాఖలో ఐదురోజుల పాటు ఉత్సాహంగా గడిపారు. గత ఏడాది డిసెంబర్ 26న విజయవాడలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం ఆంధ్రా' పోటీలకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ క్రీడల్లో యువతీయువకులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామ స్థాయి నుంచి యువతలో క్రీడా స్ఫూర్తిని నింపుతూ, ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తలపెట్టిన ఈ ప్రతిష్టాత్మక వేడుకలు ఘనంగా ముగిశాయి.



కార్యక్రమంలో పాల్గొన్న సీఎం జగన్, చిత్రంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రులు బొత్స సత్యనారాయణ, విడదల రజిని, రోజా, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, బొత్స ఝాన్సీలక్ష్మి

యువతలో స్ఫూర్తినింపిన క్రీడలు

విశాఖలో జరిగిన 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు యువతలో క్రీడలపై ఆసక్తిని పెంచాయి. చదువే కాదు క్రీడలు సైతం భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తాయన్న భరోసాను యువతకు కల్పించాయి. వైఎస్సార్ స్టేడియంలో మంగళవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ.. ఆరోగ్యం వ్యాయామాల పట్ల ప్రజలకు అవగాహన పెరగాలన్నది ఆడుదాం ఆంధ్రా పోటీల మొదటి ఉద్దేశమని చెప్పారు. ఇక్కడి విజేతలను జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా సంస్థలు ఎంపిక చేసిన విషయం ముఖ్యమంత్రి ప్రకటించడంతో యువతలో ఉత్సాహం ఉరకలెత్తింది.

కిటకిటలాడిన స్టేడియం

ఆడుదాం ఆంధ్రా ఫైనల్ క్రికెట్ మ్యాచ్‌కు వేలాది మంది యువత హాజరై మ్యాచ్ తిలకించారు. అంతర్జాతీయ స్థాయి క్రికెట్ మ్యాచ్‌కు వచ్చినట్లుగా విశాఖ నగర యువతతో పాటు సమీప జిల్లాల నుంచి కూడా పెద్ద ఎత్తున జనం హాజరయ్యారు. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వచ్చినప్పటి నుంచి యువత కేరింతలు, ఈలలతో స్టేడియం మార్మోగింది. ముఖ్యమంత్రి దాదాపు అరగంట పాటు ఫైనల్ క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించారు.

హోరెత్తిన మైదానం

ఆడుదాం ఆంధ్రా ముగింపు వేడుకలతో వైఎస్సార్ స్టేడియం హోరెత్తింది. ఒక పక్క చిన్నారుల నృత్యాలు.. మరో వైపు లేజర్ షో, ఫ్లాష్‌లైట్లతో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. తొలుత స్టేడియంలో దుబాయ్ జట్టు ఫ్లాష్ డ్యాన్స్ చక్ దే ఇండియా అంటూ అలరించగా కూచిపూడి నృత్యకారిణులు ఓం నమఃశివాయ అంటూ చేసిన ప్రదర్శన అలరించింది. క్రీడాకారులు జయహో అంటూ చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. మూడు కళారూపాలతో 'ఆడుదాం ఆంధ్రా' థీమ్ సాంగ్‌కు చేసిన నృత్యం అబ్బురపరిచింది. ఒక్కసారిగా స్టేడియంలో లైట్స్‌ఆఫ్ అయ్యాయి. అంతే డ్రోన్స్ ప్రత్యక్షమయ్యాయి.



అనంతరం వియ్ ఆర్ రాకింగ్ అంటూ ఫ్లాష్ ఫోతో స్టేడియం మిరమిట్లు గొలిపే కాంతులీనింది. స్టేడియం మొత్తం లైట్లతో లయబద్ధంగా నాట్యమాడింది. రెండు నిమిషాలపాటు బాణసంచాతో స్టేడియం దద్దరిల్లింది.

పటిష్ట బందోబస్తు

క్రీడోత్సవాలకు భారీగా క్రీడాకారులు, జనం తరలివచ్చినా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. స్థానిక సీఐ వై.రామకృష్ణ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కారు షెడ్ కూడలిలో ట్రాఫిక్ సమస్యలు నివారించడానికి సిబ్బందికి విధులు అప్పగించారు. పీఎంపాలెం-కొమ్మాది-వుడా రోడ్డు -చంద్రంపాలెంకు వెళ్లే వాహనాలను క్రమబద్ధీకరించారు.



స్టేడియంలో క్రికెట్ ఫైనల్ పోరు

వేడుకల్లో పాల్గొన్న వారు వీరే..

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర ఇన్‌ఛార్జి మంత్రి విడదల రజనీ, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధారెడ్డి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ ఇన్‌ఛార్జి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జిల్లా పార్టీ అధ్యక్షులు కోలా గురువులు, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పలనాగిరెడ్డి, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కె.భాగ్యలక్ష్మి, కంబాల జోగులు, నెడ్‌క్యాప్ చైర్మన్, విశాఖ ఉత్తర సమన్వయకర్త కె.కె రాజు,గాజువాక ఇన్‌చార్జి ఉరుకూటి చందు తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న కళాకారులు



స్టేడియంలో ఉత్సాహంగా అభిమానులు

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే 'ఆడుదాం ఆంధ్రా'

రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి ఆర్‌కే రోజా

ఏయూ క్యాంపస్: క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించాలనే సదుద్దేశంతోనే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహించామని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా తెలిపారు. మంగళవారం ఏయూ క్రీడా మైదానంలో జరుగుతున్న కబడ్డీ ఫైనల్స్‌ను ఆమె తిలకించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దాదాపు రూ.120 కోట్లు వెచ్చించి అన్ని క్రీడాంశాలతో మెగా స్పోర్ట్స్ ఈవెంట్ నిర్వహించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. క్రీడలకు ఇది ఒక స్వర్ణయుగంగా చెప్పొచ్చన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు దశల్లో 3 లక్షలకు పైగా మ్యాచ్‌లు నిర్వహించామన్నారు. విజేతలకు భారీ నగదు బహుమతులు సైతం అందిస్తున్నట్టు చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు గ్రూప్-1 ఉద్యోగాలు, అకాడమీల ఏర్పాటుకు భూములు, నిధులు కేటాయించామన్నారు. ప్రతి జిల్లాలో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేసి క్రీడాకారులకు శాప్ సహకారంతో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఆడుదాం ఆంధ్రలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను పెద్ద ఫ్రాంచైజీలతో అనుసంధానం చేసి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, నాడు-నేడుతో పాఠశాలల అభివృద్ధి, విదేశీ విద్యదీవెన వరకు అవసరమైన అన్ని సంక్షేమ పథకాలను యువతకు అందించి ప్రోత్సహిస్తున్నామన్నారు. అనంతరం బాపట్ల, తిరుపతి జిల్లాల మధ్య జరిగిన కబడ్డీ ఫైనల్స్‌ను మంత్రి రోజా తిలకించారు. 2024 జగనన్న వన్స్‌మోర్, చెట్టు మీద కొంగ చంద్రబాబు దొంగ అంటూ కూత పెడుతూ ఆమె సరదాగా కబడ్డీ కూడా ఆడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి కమిషన్ క్రియేటివ్ హెడ్ ఎల్.జోగినాయుడు, రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ ఫైనల్ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

ఉత్తరాంధ్ర తిరుమలగా పెందుర్తి వెంకటాద్రి

రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

పెందుర్తి: ఉత్తరాంధ్ర తిరుమలగా పెందుర్తి వెంకటాద్రిని పూర్తి స్థాయిలో తీర్చిదిద్దుతామని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. వెంకటాద్రిపై వేంకటేశ్వరస్వామి భక్తులకు ప్రభుత్వం తరఫున పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. పెందుర్తి వెంకటాద్రిపై రూ.కోటి జీవీఎంసీ నిధులతో నిర్మించనున్న పుష్కరిణి పనులకు మంగళవారం మంత్రి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి నడుం బిగించారన్నారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దేవాలయాల అభివృద్ధికి రూ.1500 కోట్లు వెచ్చించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రతి గ్రామంలోనూ ఒక ఆలయం ఉండాలన్న సంకల్పంతో తిరుమల శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రూ.10 లక్షల చొప్పున రూ.360 కోట్లు కేటాయించి 3,600 దేవాలయాల నిర్మాణం జరుగుతుందన్నారు. దాదాపు 10 వేల ఆలయాల్లో దూపదీప నైవేద్యాల ఖర్చుల నిమిత్తం ప్రత్యేక నిధులు కేటాయించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందని చెప్పారు. ముందుగా వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వెంకటాద్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎం.ఎస్.రాజు, ఈవో నీలిమ, ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో గురుకుల బాలికల సత్తా



సిగ్గె తేజస్వి



కొట్టికి దీపిక



దీక్షిత



సువార్త



సాయివర్షిణికి స్వీట్ తినిపిస్తున్న తల్లి

17 మంది అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక

మధురవాడ (విశాఖ): జేఈఈ మెయిన్స్‌లో మధురవాడ సమీపంలోని మారికవలస గిరిజన గురుకుల బాలికల ప్రతిభా కళాశాలకు చెందిన బాలికలు ప్రతిభ కనబరిచారు. జనవరిలో నిర్వహించిన పరీక్షలకు 24మంది హాజరు కాగా 17మంది జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారు. చింతపల్లి మండలం భీమసింగి గ్రామానికి చెందిన రమణ కుమార్తె సిగ్గె తేజస్వి 89.24 పర్సంటైల్, చింతపల్లి మండలం పనసలపాడు గ్రామానికి చెందిన రాధాకృష్ణ కుమార్తె కొట్టికి దీపిక 86.42 పర్సంటైల్, పెదబయలు మండలం లక్కేపుట్టు గ్రామానికి చెందిన రాజారావు కుమార్తె పాంగి దీక్షిత 77.32 పర్సంటైల్, డుంబ్రిగుడ మండలం తుమ్మడుగుడ గ్రామానికి చెందిన సుభదాస్ కుమార్తె బిడ్డిక సువార్త 69.94 పర్సంటైల్ సాధించింది. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ కె. విశ్వనాథం, ఉపాధ్యాయులు అభినందించారు.

మోతుగూడెం విద్యార్థులు..

మోతుగూడెం: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో చింతూరు మండలం మోతుగూడెం గ్రామానికి చెందిన వై.సాయికిరణ్, ఎస్.సాయివర్షిణి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. సాయి కిరణ్ 97.15, సాయివర్షిణి 95శాతం పర్సంటైల్ సాధించారు. వీరిని డీఏవీ స్కూల్ హెచ్ఎం, ఉపాధ్యాయులు, ఏపీ జెన్‌కో సీఈ బి. శ్రీధర్‌బాబు అభినందించారు. వీరిద్దరు టెన్త్ మోతుగూడెం డీఏవీ స్కూల్‌లో చదివారు.

ముందస్తు భద్రత చర్యలు చేపట్టాలి

విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్నీ

ఆరిలోవ (విశాఖ) : సాధారణ ఎన్నికలు జరగనున్న సందర్భంగా విశాఖ రేంజ్‌లో ముందస్తు భద్రత చర్యలు చేపట్టాలని విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్నీ పోలీస్ అధికారులకు సూచించారు. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల అదనపు ఎస్పీలు, ఏఎస్పీలు మంగళవారం నగరంలో విశాలాక్షినగర్ కైలాసగిరి ఏఆర్ కార్యాలయంలో డీఐజీని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విశాల్ గున్నీ అధికారులతో మాట్లాడుతూ శాంతి భద్రతలు, కమ్యూనిటీ పోలీసింగ్‌పై చర్చించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలకు ముందస్తు చర్యల్లో భాగంగా చెక్‌పోస్టుల వద్ద విస్తృత తనిఖీలు చేయాలని ఆయన అదనపు ఎస్పీలను ఆదేశించారు. సమస్యాత్మకమైన ప్రాంతాలను గుర్తించి వాటిలో ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. డీఐజీని కలసిన వారిలో చింతూరు సబ్ డివిజన్ అదనపు ఎస్పీ రాహుల్ మీనా, అనకాపల్లి అదనపు ఎస్పీ పి.సత్యనారాయణ, శ్రీకాకుళం అదనపు ఎస్పీ ప్రేమ్‌కాజల్, రంపచోడవరం, పాడేరు, పార్వతీపురం మన్యం జిల్లాల ఏఎస్పీలు కె.ధీరజ్, జగదీష్ ఆడహల్లి, సునీల్ షరోన్ పాల్గొన్నారు.



విశాఖ రేంజ్ పరిధిలోని అదనపు ఎస్పీలు, ఏఎస్పీలతో సూచనలిస్తున్న డీఐజీ విశాల్ గున్నీ

జాఫ్రాకు గిట్టుబాటు ధర

- గిరి రైతుల నుంచి కొనుగోలుకు కార్యాచరణ
- ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: ఏజెన్సీలో గిరిజనులు పండించే జాఫ్రాకు గిట్టుబాటు ధర కల్పించి వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో జీసీసీ, వెలుగు, ఉద్యానశాఖ అధికారులు, జాఫ్రా వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.గిరిజనుల నుంచి జాఫ్రా గింజలను దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారన్నారు. దీని వల్ల వారికి కనీస మద్దతు ధర కూడా లభించడం లేదన్నారు. గిరిజనుల నుంచి మద్దతు ధరకు జాఫ్రా విత్తనాలను కొనుగోలు చేసేలా ఐటీడీఏతో ఒప్పందం చేసుకున్న కంపెనీలకు జాఫ్రా విత్తనాలు విక్రయించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. జాఫ్రా విక్రయాల ద్వారా లాభాలు వస్తే వాటిని గిరిజన రైతులకు ఇచ్చే విధంగా ఆలోచన చేస్తున్నట్లు పీవో పేర్కొన్నారు. వివిధ కంపెనీల నుంచి వచ్చిన ప్రతినిధులతో పీవో మాట్లాడారు. ఒక మెట్రిక్ టన్ను జాఫ్రా విత్తనాలను ఎంత ధరకు కొనుగోలు చేస్తున్నారు.. ఏఏ రకాలు కొనుగోలు చేస్తున్నారు తదితర వివరాలను ఆయన తెలుసుకున్నారు. ఐటీడీఏ ద్వారా కొనుగోలు చేసిన జాఫ్రా విత్తనాలను వేలం, ఇతర మార్గాలలో వివిధ కంపెనీలకు సరఫరా చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఏపీవో జనరల్ సీహెచ్ శ్రీనివాసరావు, జీసీసీ డీఎం జి.పార్వతీశ్వరరావు, వెలుగు ఏపీడీ ఎ.శ్రీనివాసరావు, పీహెచ్‌వో చిట్టిబాబు, వెలుగు యాంకర్ పర్సన్ రామరాజు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం

సాక్షి, విశాఖపట్నం: ఆడుదాం ఆంధ్రా రాష్ట్ర స్థాయి క్రీడా టోర్నమెంట్ ముగింపు వేడుకలకు విశాఖకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. మంగళవారం సాయంత్రం 5.15 గంటలకు విమానంలో ఇక్కడి విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు సీఎంకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, భీశెట్టి వెంకట సత్యవతి, గొడ్డేటి మాధవి, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ జె. సుభద్ర, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్నీ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం 5.27 గంటలకు విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి సాయంత్రం 5.35 గంటలకు మధురవాడ ఐటీ హిల్ నెం.3 వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు ముఖ్యమంత్రి చేరుకున్నారు.

హెలిప్యాడ్ వద్ద...

హెలిప్యాడ్‌కు చేరుకున్న సీఎంకు వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు పెట్ల ఉమా శంకర్ గణేష్, ఇతర ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛాలను అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.

ఆత్మీయ వీడ్కోలు

'ఆడుదాం – ఆంధ్రా' రాష్ట్ర స్థాయి క్రీడా వేడుకలు ముగించుకుని తిరుగు ప్రయాణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రోడ్డు మార్గం ద్వారా విమానాశ్రయం చేరుకున్నారు. అక్కడ నుంచి ప్రత్యేక విమానంలో రాత్రి 8.35 గంటలకు విజయవాడకు బయలుదేరారు. జిల్లా కలెక్టర్ డా.ఎ. మల్లికార్జున, సీపీ రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ ఆయనకు వీడ్కోలు పలికారు.

వేడుకల్లో పాల్గొన్న వారు వీరే..

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి ఆర్‌కే రోజా, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర ఇన్‌ఛార్జి మంత్రి విడదల రజనీ, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దారెడ్డి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ ఇన్‌ఛార్జి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, జిల్లా పార్టీ అధ్యక్షులు కోలా గురువులు, ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పలనాగిరెడ్డి, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కె.భాగ్యలక్ష్మి, కంబాల జోగులు, నెడ్‌క్యాప్ చైర్మన్, విశాఖ ఉత్తర సమన్వయకర్త కె.కె రాజు, గాజువాక ఇన్‌చార్జి ఉరుకూటి చందు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న అరకు ఎంపీ మాధవి, మంత్రులు బూడి ముత్యాలనాయుడు, అమర్‌నాథ్, డీఐజీ విశాల్‌గున్నీ

కొడుకు కొట్టాడని తల్లి ఆత్మహత్యాయత్నం

సీలేరు: అన్నం వండలేదన్న కోపంతో కొడుకు కొట్టడంతో మనస్తాపానికి గురైన ఓ తల్లి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. జీకే వీధి మండలం దుప్పులవాడ పంచాయతీ పరిధిలోని పిల్లిగెడ్డలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ గ్రామానికి చెందిన కొర్రా జగ్గారావు మంగళవారం అన్నం వండలేదన్న కోపంతో తల్లి ఫాతిమా (58)ను కొట్టాడు. దీంతో మనస్తాపం చెందిన ఆమె పురుగుమందు తాగడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. వెంటనే స్థానిక ప్రాథమిక ఆస్పత్రికి తీసుకువచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం ఆమెను మెరుగైన వైద్యం కోసం చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషిచేయాలి

ఐటీడీఏ పీవో కావూరి చైతన్య

చింతూరు: బాల్య వివాహాలను అరికట్టేందుకు అందరూ కృషి చేయాలని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్థానిక కస్తూరిబా బాలికల పాఠశాలలో బాల్య వివాహాల నిషేధచట్టంపై మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బేటీ బచావో, బేటీ పడావో ఆవశ్యకతను అందరూ తెలుసుకోవాలని సూచించారు. బాల్య వివాహాల కారణంగా ఆడపిల్లలు విద్యాహక్కుతో పాటు ఆరోగ్యం, స్వతంత్రంగా జీవించే హక్కును కోల్పోతారని చెప్పారు. సీడీపీవో విజయగౌరి మాట్లాడుతూ ఆడపిల్లలకు 18 ఏళ్లు నిండిన తరువాతే వివాహం చేయాలని, బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



విద్యార్థినులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న పీవో చైతన్య

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

హుకుంపేట: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు జరగకుండా విద్యార్థినులు, యువతులు గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఎంపీడీవో రోణంకి వెంకటరావు తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాల కారణంగానే గిరిజన గ్రామాల్లో మాత,శిశుమరణాలు అధికంగా ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో బాలచంద్రమణి దేవి,వైద్యాధికారి డాక్టర్ గాయత్రి, ఎస్‌ఐ సతీష్, సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు తప్పనిసరి

రంపచోడవరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అన్ని పోలింగ్‌కేంద్రాల వద్ద మౌలిక వసతులు ఉండాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి సెక్టార్ అధికారులు, తహసీల్దార్లు, డీటీలతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ రంపచోడవరం, చింతూరు డివిజన్‌లో ఎన్నికల అధికారులు, సిబ్బంది ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని సూచించారు. రంపచోడవరం నియోజకవర్గంలో 399 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడమే కాకుండా 59 మంది సెక్టార్ అధికారులను నియమించినట్టు చెప్పారు. సెక్టార్ అధికారులకు కేటాయించిన రూట్లలో అవసరమైన వాహనాలకు సంబంధించి నివేదిక సమర్పించాలని సూచించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు సెక్టార్ అధికారులు తమకు కేటాయించిన రూట్లలో ఎప్పటికప్పుడు పర్యటిస్తూ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సబ్‌కలెక్టర్ ఆదేశించారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

16న అరకులోయలో మినీ జాబ్‌మేళా

సాక్షి, పాడేరు: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్తంగా ఈనెల 16న అరకులోయ యూత్ శిక్షణ కేంద్రంలో మినీ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్టు ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా అధికారి జి.ప్రశాంత్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నవతా రోడ్డు ట్రాన్స్‌పోర్టు, అపోలో ఫార్మసీ, డెలివరీ కామ్ కంపెనీల ప్రతినిధులు ఈ జాబ్‌మేళాలో పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ ఆపైచదువులు చదివిన, జిల్లాకు చెందిన 18 నుంచి 35 ఏళ్లలోపు యువతీయువకులు ఈజాబ్‌మేళాకు హాజరుకావచ్చని తెలిపారు.నిరుద్యోగ యువతీ,యువకులు తమ పాన్, ఆధార్ కార్డులు, ఇతర ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆయన కోరారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10వేల నుంచి రూ.14వేల వేతనాలు చెల్లిస్తారని, ఈమినీ జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ యువకులంతా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 93983 38105 అనే ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

జేఈఈ మెయిన్స్‌లో శశి విద్యార్థుల ప్రతిభ



దిలీప్ వెంకట సతీష్ వెంకట హర్షవర్ధన్ నాగసాయి నారాయణ ఎస్.అనిల్‌వర్మ

తగరపువలస: ఇటీవల నిర్వహించిన జేఈఈ మెయిన్స్ పరీక్షా ఫలితాలలో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. ఎస్.దిలీప్ వెంకట సతీష్ 99.94, జె.వెంకట హర్షవర్ధన్ 99.76, సిహెచ్ నాగసాయి నారాయణ 99.74, ఎస్.అనిల్‌వర్మ 99.61, జి.దుర్గాప్రసాద్ 99.46, జి.జైదీప్, సీహెచ్ శ్యామ్ సుందర్ 99.43, పి.కుశ్వంత్‌సాయిరెడ్డి 99.26, జి.పృథ్వితేజ 99.14 పర్సంటైల్ సాధించారన్నారు. 22 మంది విద్యార్థులు 98కు పైగా, 36 మంది 97కు పైగా, 45 మంది 96కు పైగా, 53 మంది 95కు పైగా, 105 మంది 90కు పైగా పర్సంటైల్ సాధించినట్టు తెలిపారు. వీరిని వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, అకడమిక్ డైరెక్టర్ మేకా క్రాంతి సుధ, అధ్యాపక బృందం అభినందించింది.

సస్యరక్షణతో అధిక దిగుబడి

రంపచోడవరం: జీడిమామిడి తోటల్లో సరియైన సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల అధిక దిగుబడి సాధించవచ్చని పందిరిమామిడి డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా. రాజేంద్రప్రసాద్ సూచించారు. మండలంలోని తామరపల్లి రైతుభరోసా కేంద్రంలో జీడిమామిడి, మామిడిలో అధిక దిగుబడి, పూత, పిందె దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆహార విభాగం శాస్త్రవేత్త వెంగయ్య తాటికల్లు ద్వారా తాటి నీర, తాటి బెల్లం తయారీలో మెలకువలను వివరించారు. ఎంపీటీసీ కుంజం వంశీ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఆర్‌బీకేలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జీడి, మామిడి రైతులకు మందులు, స్ప్రేయర్లు పంపిణీ చేశారు. రైతు భరోసా కమిటీ చైర్మన్ అబ్బులు, అగ్రికల్చర్ అసిస్టెంట్ భాస్కర్ పాల్గొన్నారు.



తామరపల్లిలో రైతులకు స్ప్రేయర్లు అందజేస్తున్న శాస్త్రవేత్తలు, ఎంపీటీసీ

50 లీటర్ల సారా స్వాధీనం

హుకుంపేట: మండలంలోని తడిగిరి పంచాయతీ పత్రిమెట్ట గ్రామంలో నాటు సారా విక్రయిస్తున్నట్లు ముందస్తు సమాచారం మేరకు మంగళవారం స్థానిక పోలీసులు గ్రామంలో దాడులు జరిపారు. పాంగి సావిత్రి అనే మహిళ అక్రమంగా విక్రయిస్తున్న 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ఆమెను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సతీష్ మాట్లాడుతు నాటు సారా విక్రయాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

10 లీటర్ల నాటుసారాతో ఒకరి అరెస్ట్

పాడేరు: వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో నాటుసారాతో ఓ వ్యక్తి పట్టుబడ్డారని జి.మాడుగుల ఎస్‌ఐ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఉరుము జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో మండలంలోని గాంధీనగర్‌కు చెందిన జి.బాలు అనే వ్యక్తి సారా క్యాన్‌తో వస్తూ పట్టుబడ్డాడన్నారు. అతని వద్ద నుంచి 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

'భోజన పథకం' అమలులో నిర్లక్ష్యం వద్దు

- కచ్చితంగా మెనూ అమలు
- జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు

సాక్షి,పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గోరుముద్ద, మధ్యాహ్న భోజనం పథకాలను మెనూ పాటిస్తూ అన్ని పాఠశాలల్లో సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు ఆదేశించారు. స్థానిక శ్రీకృష్ణాపురం బాలికల ఆశ్రమ పాఠశాలలో అన్ని యాజమాన్య పాఠశాలల హెచ్‌ఎంలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. రాగి జావ, గుడ్లు, చిక్కీలను కూడా విద్యార్థులకు పంపిణీ చేయాలన్నారు.హెచ్‌ఎంలు,ఉపాధ్యాయులంతా తమ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పర్యవేక్షించాలని ఆయన సూచించారు. మధ్యాహ్న భోజన పథకం ఏడీ జి.అప్పారావు మాట్లాడుతూ పథకం నిర్వాహకులు కూడా మరింత శ్రద్ధ వహించాలన్నారు. వంట కార్మికుల బిల్లులు, శానిటేషన్ వర్కర్ల డ్యూటీ సర్టిఫికెట్లు నిర్ణయించిన సమయానికి కార్యాలయానికి అందజేయాలని ఆదేశించారు. ప్రతిరోజు మధ్యాహ్న భోజనం చేసే పిల్లల హాజరుతో పాటు టాయ్‌లెట్స్ ఫొటోలను యాప్‌లో నమోదు చేయాలని సూచించారు.పాడేరు ఎంఈవో-1 రామచంద్రరావు మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు.పాఠశాలల్లో విద్యార్థుల బోధన కార్యక్రమాలను విస్తృతం చేయడంతో పాటు ఇంత వరకు విద్యార్థులకు నిర్వహించిన పరీక్షలలో మార్కుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆయన ఆదేశించారు.



మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీరావు, పక్కన ఎంఈవోలు

లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి రూ.60 లక్షలు మంజూరు

మహారాణిపేట (విశాఖ) : ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అభ్యర్థన మేరకు ముంచంగిపుట్టు మండలం ఏనుగురాయి పంచాయతీ సెల్లుమ్ గ్రామంలో గల లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ మంగళవారం నిధులు మంజూరు చేశారు. మంత్రి విశాఖపట్నం వచ్చిన నేపథ్యంలో ఆయనను రాడిసన్ బ్లూ హోటల్లో సుభద్ర మర్యాదపూర్వకంగా కలిసి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో ఆయన వెంటనే స్పందించి రూ. 60 లక్షల నిధులు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రికి సుభద్ర ధన్యవాదాలు తెలిపారు. అవకాశం ఉంటే తమ గిరిజన ప్రాంతంలో పర్యటించాలని మంత్రిని చైర్‌పర్సన్ కోరారు.



దేవదాయ శాఖ మంత్రి సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలుపుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ఉపమాకలో షూటింగ్ సందడి

నక్కపల్లి: మండలంలో ఉపమాకలో షూటింగ్ సందడి నెలకొంది. హాస్యమూవీస్ బ్యానర్‌పై అల్లరి నరేష్ హీరోగా నిర్మిస్తున్న బచ్చలపల్లి సినిమా షూటింగ్ రెండో షెడ్యూల్ మంగళవారం ప్రారంభించారు. దర్శకుడు బి.సుబ్బు ఇక్కడ ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయ పరిసరాల్లో కొంతమంది నటీనటులకు సంబంధించిన సన్నివేశాలను చిత్రీకరించారు.

విద్యార్థిని ఆత్మహత్య

అరకువేలి గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో ఘటన

అరకులోయరూరల్: పాఠశాలలో ఓ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన మంగళవారం జరిగింది. విద్యార్థినులు, ఉపాధ్యాయులు తెలిపిన వివరాలిలా.. డుంబ్రిగుడ మండలం ఓంబి గ్రామానికి చెందిన కిల్లో వసంత(14) అరకువేలి మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. మధ్యాహ్నం వసతి గృహం వద్ద ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అదే సమయంలో వసతి గృహంలోకి వచ్చిన తోటి విద్యార్థినులు ఉరివేసుకున్న వసంతను చూసి ఉపాధ్యాయులకు తెలియపరిచారు. వెంటనే వారు పోలీస్‌లకు సమాచారమిచ్చారు. సీఐ రుద్రశేఖర్ ఘటన స్థలానికి చేరుకుని విద్యార్థిని మృతికి గల కారణాలను పరిశీలించారు. వసంత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అరకు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పోలీస్‌ల దర్యాప్తు

కిల్లో వసంత ఓంబి గ్రామం నుంచి మంగళవారం మధ్యాహ్నమే పాఠశాలకు వచ్చింది. ఓ హత్యకేసులో విద్యార్థిని తండ్రి ఇటీవలే సెంట్రల్ జైలు నుంచి విడుదలైయ్యాడు. తండ్రిని చూసేందుకు వెళ్లిన వసంత.. మంగళవారం పాఠశాలకు వచ్చి మధ్యాహ్నం భోజనం చేయకుండా వసతి గృహంలోనే ఉండిపోయింది. తోటి విద్యార్థులు లేని సమయంలోని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై పోలీస్‌లు దర్యాప్తు చేపట్టారు.



కిల్లో వసంత మృతదేహం

మళ్లీ తగ్గుతున్న ఉష్ణోగ్రతలు

- అర్ధరాత్రి నుంచి చలిగాలులు
- దట్టంగా పొగ మంచు
- మధ్యాహ్నం భానుడి ప్రతాపం

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా సోమవారం అర్ధరాత్రి నుంచి చలిగాలులు విజృంభిస్తున్నాయి. ఒక్కసారిగా మంగళవారం ఉష్ణోగ్రతలు తగ్గిపోయాయి. పొగమంచు తీవ్రత పెద్దగా లేనప్పటికి వాతావరణం అతిశీతలంగా ఉండడంతో వేకువజామున నుంచి చలిగాలులు వణికించాయి. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో సోమవారం 12 డిగ్రీలు, మంగళవారం 8డిగ్రీలు నమోదయ్యాయి. పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డు వద్ద సోమవారం 16డిగ్రీలు, మంగళవారం 12 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డు వద్ద సోమవరం 15.5 డిగ్రీలు, మంగళవారం 12.8డిగ్రీలు నమోదయ్యాయి. మరోపక్క జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్నం 2 గంటల వరకు ఎండ తీవ్రత నెలకొంది. ఉదయం 8గంటల వరకు చలితో ఇబ్బందులు పడిన ప్రజలు మధ్యాహ్న సమయంలో ఎండతో అవస్థలు పడ్డారు. జిల్లా కేంద్రం పాడేరులో అంబేడ్కర్ సెంటర్‌తోపాటు ప్రధాన రోడ్లు నిర్మానుష్యంగా కనిపించాయి. జి.మాడుగుల సంతకు వచ్చిన వ్యాపారులు, పరిసర ప్రాంతాల ప్రజలు ఎండ కారణంగా ఇబ్బందులు పడ్డారు. రెండు రోజుల నుంచి చలితీవ్రత కారణంగా మంటలను ఆశ్రయించి ఉపశమనం పొందుతున్నారు.

రాజవొమ్మంగి: మండలంలో మంగళవారం ఉదయం 9 గంటల వరకు తెరలు కమ్ముకున్నాయి. అటవీ, వ్యవసాయ పనులకు వెళ్లేవారు తమ కార్యక్రమాలను ఆలస్యంగా మొదలు పెట్టారు. దట్టంగా కురుస్తున్న మంచు వల్ల పూతకు నష్టం జరుగుతుందని మామిడి, జీడిమామిడి రైతులు వాపోతున్నారు.



పాడేరులో కురుస్తున్న మంచు

'ఇన్‌స్పైర్' అయ్యారు..

- 'ఇన్‌స్పైర్ మనక్'లో ప్రతిభ చూపిన విద్యార్థులు
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 200 ప్రాజెక్టుల ఎంపిక
- ఒక్కో విద్యార్థికి రూ.10 వేల ప్రోత్సాహకం

విశాఖ విద్య: ఇన్‌స్పైర్ మనాక్ పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక విభాగం మంగళవారం ప్రకటించిన 'ఇన్‌స్పైర్ మనక్' పోటీల ఫలితాల్లో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన 200 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఒక్కో విద్యార్థి రూ.10 వేలు ప్రోత్సాహకం అందుకోనున్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల వారీగా సిద్ధం చేసి, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నగదు ప్రోత్సాహకం అందించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సామాజిక అంశాలే అజెండా

మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతీ ఏటా పాఠశాల స్థాయిలో 'ఇన్‌స్పైర్ మనాక్' పేరిట విద్యార్థుల్లో సృజనాత్మకతపై పోటీలను నిర్వహిస్తోంది. సామాజిక అంశాలు, సమాజాభివృద్ధికి దోహదపడే వినూత్నమైన ఆలోచనలకు రూపం ఇచ్చేలా ఎలాంటి ప్రాజెక్టులను తయారు చేస్తామనే అంశంపై విద్యార్థులు తమ ఐడియాను నమోదు చేయాల్సి ఉంటుంది. ఇలా ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 2023–24 విద్యా సంవత్సరానికి 2,680 మంది పేర్లు నమోదు చేసుకోగా, ఇందులో 200 మంది ఎంపికయ్యారు. ఇలా ఎంపికైన ఒక్కో విద్యార్థి రూ.10 వేలు నగదు ప్రోత్సాహకం అందుకోనున్నారు. ఆ మొత్తాన్ని వినియోగించుకుని, ప్రాజెక్టుకు అవసరమయ్యే సామగ్రిని సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించి, భావి శాస్త్రవేత్తలుగా తయారు చేయాలనే ప్రభుత్వ లక్ష్యం దిశగా సైన్సు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇన్‌స్పైర్ మనాక్ పోటీల్లో ఎంపికైన ఒక్కొక్కరికి రూ.10 వేలు ప్రోత్సాహకం అందుతుందని, ఇందుకోసం విద్యార్థుల పేర్లుతో బ్యాంకు అకౌంట్ తెరవాలని విశాఖ జిల్లా సైన్సు అధికారి కె.ప్రసాద్ తెలిపారు.



ప్రయోగాలు చేస్తున్న సింహాచలం గురుకులం విద్యార్థులు (ఫైల్)